# వైభవంగా లక్ష్మీనరసింహుల గజవాహన సేవ


యాదగిరిగుట్టలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా సాగాయి. సుప్రభాతం నుంచి పవళింపు సేవ వరకు నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి, దర్బార్ సేవల్లో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు నిర్వహించారు. సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో సాగింది. ఉదయం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హవనం జరిపారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహన సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. సాయంత్రం అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను కోలాహలంగా నిర్వహించారు. ముత్తయిదువులు మంగళహారతులతో అమ్మవారిని స్తుతిస్తూ, పాటలు పాడుతూ సేవ ముందు నడిచారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలోని ఊయలలో శయనింపు చేయించారు. అమ్మవారిని కొనియాడుతూ లాలిపాటలు పాడారు. కార్తీకమాసం సందర్భంగా కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు పాల్గొని వ్రతమాచరించారు. తెల్లవారు జాము నుంచే మహిళలు దీపారాధనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.28,52,711 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత, అనువంశికధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.


### మస్కట్‌లో స్వామివారి కల్యాణం

ఒమన్ రాజధాని మస్కట్‌లో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి 2 గంటలపాటు కల్యాణోత్సవం జరిపారు. ఆశీర్వచనం, ఆరగింపు, తీర్థ ప్రసాదాల గోష్టితో ఉత్సవాలను పరిసమాప్తి గావించారు. వేడుకల్లో ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు మంగళగిరి నరసింహమూర్తి పాల్గొన్నారు.


నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

# సోమేశ్వరుడి ఆలయంలో రుద్రాభిషేకం

మేళ్లచెర్వు, డిసెంబర్ 1 : కార్తీక మాసం పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సంత సోమేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, హోమాలు, ఆకాశదీప పూజలు జరిపించారు. శివాలయం, వేంకటేశ్వర, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భానుకిరణ్‌శర్మ, సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


మేళ్లచెర్వు : ప్రత్యేక అలంకరణలో సంత సోమేశ్వరుడు

### నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి : పంచనారసింహ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం స్వామివారి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపించారు. అనంతరం ఆలయ పుర వీధుల్లో గరుడవాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


మఠంపల్లి : నృసింహుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


శాలిగౌరారం మండలం జాలోనిగూడెంలో వరి నాటు వేస్తున్న కూలీలు


జాలోనిగూడెం శివారులో వరి నారు తీస్తున్న కూలీలు

# యాసంగి సాగులో రైతన్న బిజీ

యాసంగి సాగులో రైతులు బిజీగా ఉన్నారు. ఇప్పటికే మండలంలోని నాన్ ఆయకట్టు ప్రాంతంలో రైతులు ముందస్తుగా వరి నార్లు పోసుకున్నారు. ఆయకట్టు కింద ఇంకా పలుచోట్ల వరి కోస్తుండగా, నాన్ ఆయకట్టు కింద మాత్రం నాట్లు ప్రారంభించారు. మండలంలోని జాలోనిగూడెంలో వరి నాట్లు వేస్తుండగా ఎన్జీకొత్తపల్లి, రామాంజపురం, బైరవునిబండ తదితర గ్రామాల్లో నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గడిచిన వానకాలం సీజన్‌లో శాలిగౌరారం ప్రాజెక్ట్ ఆయకట్టుతోపాటు నాన్ ఆయకట్టు కింద రైతులు 13 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పలుచోట్ల వరికోతలు చివరి దశలో ఉన్నాయి. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1,500 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు.

– శాలిగౌరారం, డిసెంబర్ 1


శాలిగౌరారం శివారులో మొల్క చల్లుతున్న రైతు


ట్రాక్టర్‌తో దదును చేస్తున్న రైతు


నల్లగొండలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సందడి

# నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ కిటకిట

- ఓటింగ్ కోసం వచ్చి హైదరాబాద్ తిరిగి వెళ్తున్న వారితో కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణం

నల్లగొండ సిటీ, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేందుకు తమ సొంత గ్రామాలకు వచ్చారు. శుక్రవారం తిరుగు ప్రయాణంలో భాగంగా నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. ఉదయం 5 గంటల నుంచే హైదరాబాద్ నాన్‌స్టాప్ పాయింట్ ప్రయాణికులతో నిండిపోయింది. ఈ పరిస్థితి సాయంత్రం వరకు ఇలాగే కొనసాగింది. దాంతో ప్రయాణికులకు అనుగుణంగా అదనపు బస్సులు నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.